**కథ**

# నయనపూర్ ఎక్స్‌ప్రెస్

ఒరియా మూలం : సురేంద్ర మొహంతి

స్వేచ్ఛానువాదం : బి.కె. ఈశ్వర్

**కాళరాత్రి.**

కారుమబ్బులు ఆకాశాన్ని పెనుభూతంలా ఆవరించుకుని వున్నాయి. ఏ క్షణంలోనైనా జడివాన ప్రారంభమయ్యే సూచనలున్నాయి. స్టేషన్ రోడ్‌లో మామూలుగా తిరిగే వీధి కుక్కలు కూడా వాతావరణాన్ని చూసి జడుసుకున్నట్లుగా ఎక్కడెక్కడో తలదాచుకున్నాయి. మధ్య మధ్య మబ్బులను చీల్చుకుంటూ మెరుపులు...

ఆ చీకట్లో నరేంద్ర జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్తూ ఒక టెలిగ్రాఫ్ స్తంభాన్ని గుద్దుకోబోయి, అప్రమత్తంగా ఉండడం వల్ల, దెబ్బ తినకుండా తప్పించుకున్నాడు.

చాలా దూరం నడిచాడు. ఇంకాస్త దూరం నడిస్తే, 'గూడు' చేరుకోవచ్చుననుకుంటూ వుండగానే - వర్షం ప్రారంభమైంది.

అప్పుడు సమయం అర్ధరాత్రి 12 గంటల 45 నిమిషాలు! నయనపూర్ ఎక్స్‌ప్రెస్ 2 గంటల 57 నిమిషాలకు రావాలి. ఇప్పుడా ట్రెయిన్ ఏ ప్రాంతాల్లో వుండి వుంటుంది? మధుపూర్, షాన్‌క్రేవ్? కమార్ ఘాటే? ఉన్నట్లుండి ఉత్సాహంగా, హుషారుగా నడవ సాగాడు. అతని కాళ్లల్లో ఏదో కొత్త శక్తిప్రవేశించినట్లయింది!

జీవితంలో ఎన్నో రాత్రులు... కానీ ఈ రాత్రి మాత్రం మరపురానిది. ఎందుకనో తన 'గూటి'కి అప్పుడే వెళ్లాలనిపించడం లేదు నరేంద్రకు.

వాన రాను రాను ఉధృతమౌతోంది. అది తుపానుగా పరిణమించే సూచనలు కనిపిస్తున్నాయి. ఉరుముల నేపథ్య సంగీతంలో వాన - తుపాను కలిసియుగళ నృత్యం చేస్తున్నట్లుగా వుంది ఆ వాతావరణం. పతులు, భ్రష్టులు, బాధా సర్పదష్టుల ఆక్రోశాలతో నిర్వీర్యమైన ఈ సమాజంలో దుష్టశక్తులకు వ్యతిరేకంగా సాగే పోరాటానికి మంత్ర పఠనం జరుగుతోందా ఈ తుపాను రూపంలో?

ఆకాశంలో మళ్లీ ఓ మెరుపు... నరేంద్ర ఎడమవైపు తిరిగి మిల్లు కార్మికుల కాలనీలోకి వచ్చాడు. ఎక్కడా మనుషులున్న జాడే లేదు. తెల్లవారుజామున రెండు గంటల షిఫ్టుకు వెళ్లవలసిన కార్మికులు ఈ జడి వానకు జడిసి ముందుగానే మిల్లుకు వెళ్లిపోయి వుంటారు. జేబులోని సిగరెట్ పెట్టె తీశాడు. వానకు తడిసి సిగరెట్లన్నీ పాడైపోయాయి. విసుక్కున్నాడు.

దూరంనుంచి ఏదో రైలు వస్తున్న చప్పుడు వినిపించింది. అప్ ట్రెయినా లేక డౌన్ ట్రెయినా? అప్ ట్రెయినేమైనా బ్రిడ్జి మీద నుంచి వస్తూ వుండాలి. బహుశా గూడ్సు బండి అయి వుంటుంది. ఆ సమయంలో వచ్చే ప్రయాణీకుల రైలు ఏదీ లేదు. రానున్నది ఒకే ఒక ట్రెయిన్. అది నయనపూర్ ఎక్స్‌ప్రెస్! కొత్త కెనడియన్ ఇంజన్‌తో గంటకు ఎనభై మైళ్ల వేగంతో ఉరకలు వేసే ట్రెయిన్!

నరేంద్ర ఒక్క క్షణం ఆగాడు. 472 మైలురాయి అతని కళ్లముందుమెదిలింది. ఆ తర్వాత మేఘా బ్రిడ్జ్! ఒక్కసారిగా అతని తల గిర్రున తిరిగినట్లయింది. ఆ ఆలోచనే భరించలేనంత దారుణంగా వుంది. స్త్రీల ఆర్తనాదాలు... పసిపిల్లల రోదన... ముసలివాళ్ల చావు కేకలు.. ఎంతోమంది దీనాతిదీనమైన పరిస్థితిలో మృత్యువు ఇనుప పాదాల కిందపడి నలిగిపోతారు.

మర్నాడు ఉదయం దినపత్రికల్లోని పతాక శీర్షిక ఇదే అవుతుంది. 'పట్టాలు తప్పిన నయన్‌పూర్ ఎక్స్‌ప్రెస్... దారుణమైన రైలు ప్రమాదం...'

హత్య... ఘాతుకం... భ్రూణ హత్యలు... సామూహిక హత్యలు... ఒకటిగాదు... రెండుకాదు... ఎన్నో హత్యలు!

ఆ రైలు ప్రయాణంలో భవిష్యత్తును అందంగా వూహించుకుంటూ నిద్రపోయేవారు.. మధురమైన కలలు కంటూ నిద్రపోయేవారు... ఎంతోమంది ఆ నిద్రలోనే శాశ్వత నిద్రకు లోనవుతారు! రైలు ప్రమాదం గురించి విలేకరులు రకరకాలుగా వర్ణించి రాస్తారు. ఇంతమంది చావుకు కారకులైన వాణ్ణి అలెగ్జాండర్‌తోనో లేదా హిట్లర్‌తోనో పోలుస్తారు.

లేబర్ కాలనీలోని ఓ గుడిసెలో లాంతరు మినుకు మినుకుమంటూ వెలగడం చూశాడు నరేంద్ర. తలుపు దగ్గర చీకట్లో ఒక వ్యక్తి బీడీ కాలుస్తూ కూర్చున్నాడు. మధ్యమధ్యబీడీ చివర్లో కాలుతుండగా వచ్చే చిన్న మెరుపు ఆ చీకట్లోంచి మెరుస్తోంది.

"ఎవరు?" అని అడిగాడు నరేంద్ర గుడిసె ముందుకు వెళ్ళి.

ఆ వ్యక్తి నరేంద్ర గొంతును గుర్తుపట్టినట్లున్నాడు. "నేను బాబూ... బినిదియాని. ఈ తుపానులో కమలా వాళ్లమ్మ మిల్లు నుంచి ఎలా వస్తుందో... ఆమె కోసమే చూస్తున్నాను" అన్నాడు ఒక రకమైన యాస గొంతుతో.

నరేంద్ర అప్పటికి ముద్దగా తడిసిపోయాడు. మెల్లగా గుడిసెలోకి వెళ్లి, "బినిదియా... నీదగ్గర బీడీ వుందా?" అని అడిగాడు.

ఆ సమయంలో, ఆ స్థితిలో నరేంద్రను చూసి మొదట ఆశ్చర్యం కలిగినా, అతనికి ఈ బాబుల ధోరణులు చిరపరిచితమైనవే. వాళ్లకు పగలు, రాత్రి, ఎండా, వానా అనే తేడాలే వుండవు. బినిదియా గూట్లోంచి రెండు బీడీలు తీసి నరేంద్రకు యిచ్చాడు. అక్కడున్న చాపమీద బినిదియా ఇద్దరు పాపలు - కమల, విమల పడుకుని వున్నారు. వాళ్ల పక్కన కమలా వాళ్లమ్మ పడుకోడానికి జాగా ఖాళీగావుంది. నరేంద్ర వెలుగుతున్న లాంతరు నుంచి బీడీ వెలిగించాడు. మళ్లీ ఆలోచనలు అతన్ని ముసురుకున్నాయి.

ఆరోజు సాయంత్రమే - ఓ గృహిణి తన పాపను తీసుకుని నయనపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి వుంటుంది. మసూద్‌గర్‌లో దిగాలని! నయనపూర్ ఎక్స్‌ప్రెస్ మేఘాబ్రిడ్జ్ మీదుగా ఆ స్టేషన్‌కు 2 గంటల 57 నిమిషాలకు రావాలి. ఆమె భర్త జీవనోపాధి కోసం మసూద్‌గర్ వచ్చి, అక్కడ ఒక పని సంపాయించి, అతి కష్టం మీద ఆ వూళ్లో అద్దెకు ఓ చిన్న గది తీసుకుని వుంటున్నాడు. భార్యా పిల్లల్ని రమ్మని ఉత్తరం రాసి, ఆరోజు స్టేషన్‌లో వాళ్ల కోసం ఎదురుచూస్తూ వుంటాడు. భార్య, తన భర్తను కలుసుకోబోతున్నాననే ఆనందంతో - మసూద్‌గర్ స్టేషన్ ఎప్పుడు వస్తుందా? అని ఆత్రుతగా కిటికీ దగ్గరే కూర్చుని చూస్తూ వుండి వుంటుంది.

సరిగ్గా రైలు 472వ మైలురాయి దగ్గరకు వచ్చే టప్పటికి, అక్కడ ఫిష్‌ప్లేట్లు తొలగింపబడి వుంటాయి! రైలు ఒక్కసారిగా పట్టాలు తప్పి పడిపోతుంది!!

నరేంద్ర గుడిసెలోంచి బైటికి వచ్చాడు.

కాలనీ మధ్యలో - తక్కిన ఇళ్లకు భిన్నంగా పై భాగాన సిమెంటు షీట్లతో కప్పిన తన 'గూటి'కి చేరుకుని తలుపు తట్టాడు నరేంద్ర. ఒక్క క్షణం ఆగి చూస్తే, అవతలివైపు గొళ్లెం వేయకుండా ఉండడం వల్ల, తలుపు తెరిచే వుంది. శ్యామల్ నిద్రపోతున్నాడు. "ఇడియట్" అని గొణుక్కున్నాడు.

వాన తగ్గలేదు. అంతకంతకూ ఉధృతమౌతూనే వుంది. నరేంద్రకు గొంతు ఎండిపోయినట్లయింది. మూలనున్న కూజాను పైకెత్తి వంచాడు. అందులో నీళ్లులేవు. కోపంతో దాన్ని విసిరికొట్టాడు.

తను ఏడు రోజులుగా ఒక పథకం వేసి, అతి

సుప్రసిద్ధ ఒరియా రచయిత కీ॥శే॥ సురేంద్ర మొహంతి పత్రికా రచయిత కూడా. ఆయన ప్రముఖ ఒరియా దిన పత్రిక 'సంబాద్'కు సంపాదకత్వ బాధ్యతను నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. ఆయన రచించిన నవలలు, వెలువరించిన కథా సంపుటాలు, 'పథా ఓ పృథిబి' పేరిట ప్రచురించిన ఆత్మ కథ ఒరియా సాహిత్య చరిత్రలో ఆయనకొక ఉన్నత స్థానాన్ని ఏర్పరచాయి. నేటి అస్తవ్యస్త సమాజంలో ఆధునిక వ్యక్తి ఎటువంటి ఒత్తిడులకు లోనవుతున్నదీ సమర్థవంతంగా చిత్రీకరించడంలో సురేంద్ర మొహంతి సిద్ధహస్తులు.

జాగ్రత్తగా మేఘా బ్రిడ్జ్ సమీపంలోని 472వ మైలు రాయి దగ్గరున్న ఫిష్ ప్లేట్లు తొలగించి - అనుకున్న పనిని ఆరోజు అతి చాకచక్యంగా పూర్తిచేసి వస్తే - ఈ వెధవ... ఇక్కడ కూజాలో నీళ్లు కూడా పెట్టకుండా హాయిగా నిద్రపోతున్నాడు!

నరేంద్రకు తన భార్య మంజు జ్ఞాపకం వచ్చింది. బలవంతంగా తను ఆమెను పుట్టింటికి పంపించి వేసినా, ఇలాంటి సమయాల్లో ఆమె జ్ఞాపకాలు అతన్ని వేధిస్తూనే వుంటాయి.

"మంజూ... భార్యగా, నేను చేసే పనులన్నింటిలోనూ నువ్వు పాలుపంచుకోవాలి... భార్య అంటే కేవలం దాంపత్య సుఖానికే..."

"ప్లీజ్... నన్ను క్షమించండి. నేనీ హింసాత్మక చర్యలు సహించలేను. ఈ పిస్తోళ్లు, బుల్లెట్లు, బాంబులు... వీటిని తలుచుకుంటేనే నా గుండె జలదరిస్తోంది..." ఏడుస్తూనే చెప్పింది ఆరోజు.

"మంజూ... రానున్న విప్లవానికి నువ్వు ద్రోహం తలపెట్టేలా వున్నావు. ఇది నేనెంత మాత్రం సహించను. నువ్వు తప్పనిసరిగా ఈ విప్లవ చర్యల్లో పాల్గొనాలి. లేకపోతే నీకిక్కడ స్థానం లేదు!" గర్జించాడు నరేంద్ర.

అప్పటికే గర్భవతిగా వున్న మంజు ఎన్నోరోజుల పాటు ఈ నిందలు, నిష్ఠూరాలను భూదేవిలా భరించింది. కానీ ఆరోజు మాత్రం ఆమె తన సహనాన్ని కోల్పోయింది.

ఆరోజు నరేంద్ర ఇల్లు చేరుకొనేసరికి తెల్లవారింది. ఆ రాత్రంతా మంజు భోజనం చేయకుండా భర్త కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అతను వచ్చి రాగానే - ఆమె అతని ధోరణి పట్ల తన ఆవేశాన్ని వ్యక్తం చేసింది. ఈ తరహా పనుల వల్ల ఆరోగ్యం, మనశ్శాంతి వుండవని హెచ్చరించింది. అప్పటికే చిర్రాగ్గా వున్న నరేంద్రలో ఆగ్రహం పెల్లుబుకి, ఆమెమీద చెయ్యి చేసుకునేసరికి ఆ హఠాత్పరిణామానికి ఆమె ఖిన్నురాలైంది. ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆరోజే పుట్టింటికి ప్రయాణమై వెళ్లిపోయింది మంజు.

నరేంద్ర మామగారు నయన్‌పూర్ గూడ్స్ యార్డ్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నారు. మంజు వెళ్లిన కొన్ని రోజుల తర్వాత ఆమె ప్రసవించినట్లు, కూతురు పుట్టినట్లు నరేంద్రకు కబురొచ్చింది. కానీ అదొక విశేష వార్తగా అతను పరిగణించలేదు.

మంజు జ్ఞాపకాలలో నరేంద్ర ముఖం ఎర్రబడింది. అటువంటి సమయాలలోనే మంజు తనపట్ల ఎంత ప్రేమగా వుండేదీ, తనను ఎంత బాగా చూసుకునేదీ తలచుకుంటూ వుంటాడు నరేంద్ర. అప్పుడు అతని హృదయం మెత్తబడినట్లు, ఈ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట తనకు లభ్యమవుతున్నట్లు అనిపిస్తుంది!

తనవల్ల ఆమెకు ఏర్పడిన ఇబ్బందులను బాధలను తలచుకుని ఆవేదన, పశ్చాత్తాపాలతో - ఆమెకు ఉత్తరం రాయాలని, తిరిగిరమ్మని అభ్యర్థించాలనీ అప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాడు నరేంద్ర. కానీ ఏదో ఒక రకమైన పురుషాహంకారం అందుకు అడ్డొస్తూ వుంటుంది! శ్యామల్ లేచి కూర్చున్నాడు. నిశ్శబ్దంగా వున్న నరేంద్రను చూసి "ఎప్పుడొచ్చావ్?" అని అడిగాడు.

ఆ మాటలతో ఆలోచనల నుండి బైటపడ్డాడు నరేంద్ర. "మేఘా బ్రిడ్జి సమీపంలోని 472వ మైలురాయి వద్ద ఆరు ఫిష్ ప్లేట్లు తీసేసి, నదిలోకి విసిరేశాను. మసూద్‌గర్ స్టేషన్‌కు వచ్చే నయనపూర్ ఎక్స్‌ప్రెస్ అక్కడికి రాత్రి సరిగ్గా రెండు గంటల యాభై నిమిషాలకు వస్తుంది" అన్నాడు యాంత్రికంగా.

ఆ మాటలు వినగానే ఒక్కసారి ఆనందంతో ఓ కేక వేశాడు శ్యామల్. "ఆ పార్టీ నాయకుడు కార్మికుల ముందు ప్రసంగించడానికి ఈరోజు ఆ రైల్లోనే వస్తున్నాడు. విప్లవానికి ద్రోహం చేస్తే, ఎలాంటి శిక్ష లభిస్తుందో - ఇప్పుడే వాడికి తెలుస్తుంది. నరేంద్రా.. నీకు తెలుసు కదా... ఆ ట్రేడ్ యూనియన్ స్థాపించడానికి నేను ఎన్ని కష్టాలు పడిందీ... ఎన్ని బాధలు అనుభవించిందీ... ఈనాయకులేమో మిల్లు యజమానులకు ఏజంట్లలా వ్యవహరిస్తున్నారు. మన విప్లవాన్ని పడగొట్టడానికి, మన యూనియన్‌కు పోటీగా మరో యూనియన్‌ను పెట్టడానికి ఈ పెట్టుబడీదారులు కుట్రపన్నుతున్నారు. వాళ్లకు ఇదే మంచి గుణపాఠం. వెల్‌డన్ నరేంద్రా.. వెల్‌డన్..."

అప్పటికే బాగా అలిసిపోయి వున్న నరేంద్ర బట్టలు కూడా మార్చుకోకుండా అలా తడి బట్టలతోనే చాప మీద కొంతసేపు పడుకున్నాడు. కొన్నినిమిషాల తర్వాత లేచి అసహనంగా అటూ ఇటూ తిరగసాగాడు. బైట - వాతావరణంలో ఎలాంటి మార్పులేదు. కుంభవృష్టిగా వాన కురుస్తోంది. శ్యామల్ అతన్నే చూస్తున్నాడు. అకస్మాత్తుగా నరేంద్ర దృష్టి టేబుల్ మీదున్న ఉత్తరాల మీద పడింది. "అవి నీకొచ్చిన ఉత్తరాలే. నువ్వు వెళ్లిన తర్వాత వచ్చాయి" అన్నాడు శ్యామల్.

లాంతరు వెలుగులో ఆ ఉత్తరాలను చూస్తూ వుంటే, మంజు దస్తూరీలో వున్న ఓ ఉత్తరం అతనికి ఆత్రుతను కలిగించింది. అసహనంగా ఆ కవరును చింపి, త్వరత్వరగా ఉత్తరం చదివాడు. "మీరు నన్ను ఎన్ని మాటలన్నా, ఏం చేసినా నా స్థానం మీవద్దే నంటూ ఎంతో ఆప్యాయంగా, ప్రాధేయపూర్వకంగా రాసిందామె. నమ్మకం కలగక ఆ ఉత్తరాన్ని లాంతరుకు దగ్గరగా వుంచి మళ్లా చదివాడు. చిట్టచివర మంజు రాసింది.



"జూలై 25న మనీ పాను తీసుకుని నయనపూర్ ఎక్స్‌ప్రెస్‌లో నేను అక్కడకు వస్తున్నాను. మీరు దయచేసి నాకోసం స్టేషన్‌కు వస్తారు కదూ..."

ఉత్తరం అతని చేతుల్లోంచి జారి కింద పడింది. పిచ్చివాడిలా అతను కాలెండర్ దగ్గరకు పరుగెత్తాడు. ఈ రోజే జూలై 25. అంటే... ఈరోజే పాపను తీసుకుని మంజు - నయనపూర్ ఎక్స్‌ప్రెస్‌లో. గడియారంలో సమయం 2 గంటల 35 నిమిషాలు. కంగారు కంగారుగా గది బయటకు వచ్చాడు. ప్రకృతి ప్రళయ తాండవం చేస్తోంది. అతనిమనసులోనూ తుపాను ప్రారంభమైంది. ఆకాశం ఆక్రోశిస్తున్నట్టుగా ఏకధారగా వాన కురుస్తోంది.

నరేంద్ర మళ్లీ గదిలోకి వచ్చాడు. సమయం 2 గంటల 45 నిమిషాలు... అంటే ఇక 12 నిమిషాలే వుంది!

"నరేంద్రా... రేపు మనం పెద్ద ఎత్తున కార్మికుల సమావేశం ఏర్పాటుచేయాలి. ఏమంటావ్?" శ్యామల్ నరేంద్ర వంక చూస్తూ అడిగాడు - తన ధోరణిలో.

2 గంటల 47 నిమిషాలు... ఇంకా పది నిమిషాలే వుంది!

నరేంద్ర చాపమీద కూలబడి, రెండు కాళ్ల మధ్య ముఖం దాచుకున్నాడు. అతని మస్తిష్కంలో నయనపూర్ ఎక్స్‌ప్రెస్ గంటకు 80 మైళ్ల వేగంతో ఉధృతంగా, నిర్దాక్షిణ్యంగా ముందుకు దూసుకుంటూ వచ్చేస్తోంది!